
సాక్షి
అనకాపల్లి
సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024





## బకాయి జీతాలు చెల్లించాలి

శానిటేషన్ వర్కర్లకు ఆరు నెలల బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. 10లో



## ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

అనకాపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. 10లో

## అమ్మవారికి కాసుల పేరు



మునగపాక: అరబుపాలెంలోని ముసిలితల్లి అమ్మవారికి ఆదివారం ఒంపోలుపేటకు చెందిన పతిశెట్టి రాజు,వరలక్ష్మి దంపతులు 12 తులాల బంగారు కాసుల పేరు బహూకరించారు.

## న్యూస్‌రీల్

### నేడు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు

తుమ్మపాల: భారీ వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఉత్తర్వులు అతిక్రమించి విద్యాసంస్థలను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

### నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

తుమ్మపాల: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) రద్దు చేసినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆమె కోరారు. ఈనెల 9న నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

### సీఐలకు బదిలీ

- వీఆర్‌లో ఉన్న 8 మందికి పోస్టింగ్



సాక్షి, అనకాపల్లి: విశాఖ రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేయడంతో పాటు వీఆర్‌లో ఉన్న ఎనిమిది మందికి పోస్టింగ్ ఇచ్చారు. ఇద్దరిని వీఆర్‌కు పంపారు. ఈమేరకు ఆదివారం డీఐజీ గోపీనాథ్ జట్టి ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో పీసీఆర్ సీఐగా పనిచేస్తున్న నమ్మి గణేష్‌ను అచ్యుతాపురానికి, పరవాడ సీఐ బాల సూర్యారావును ఎస్పీకార్యాలయం స్పెషల్ బ్రాంచ్‌కు, నక్కపల్లి సీఐ జి.అప్పన్నను పాయకరావుపేటకు, కె.కోటపాడు సీఐ బి.చిన్నస్వామి నాయుడును శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్‌కు, అల్లూరి జిల్లా పాడేరు సీఐ డి.నవీన్ కుమార్‌ను అదే జిల్లాలో సీసీఎస్ సీఐగా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న సీఐ రేవతమ్మకు నర్సీపట్నం రూరల్ సీఐగా ,పైడపునాయుడుకు కె.కోటపాడు సర్కిల్ సీఐగా, ఎం.వినోద్‌బాబుకు సోషల్‌మీడియా సైబర్ సెల్ సీఐగా, డి., దీనబంధుకు అల్లూరి జిల్లా పాడేరు సీఐగా, ఆర్.మల్లికార్జునరావుకు పరవాడ సీఐగా, బెండి వెంకట్రావ్‌కు విజయనగరం టాస్క్‌ఫోర్స్ సీఐగా, జి.అశోక్‌కుమార్‌కు అనకాపల్లి రూరల్ సీఐగా, వి. చక్రధరరావుకు విజయనగరం డీసీఆర్‌బీ సీఐగా పోస్టింగ్ కల్పించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సీఐగా పనిచేస్తున్న బుచ్చిరాజును, అల్లూరి జిల్లాలో సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న వెలగాడ శంకర నారాయణను వీఆర్‌కు బదిలీ చేశారు.

# జనసేన ఎమ్మెల్యేలకు షాక్



- గన్‌మెన్‌ను వెనక్కి పంపించిన ఎమ్మెల్యే పంచకర్ల
- అదే బాటలో నేడు వంశీకృష్ణ కూడా...
- పోలీసు ఉన్నతాధికారి నుంచి స్పందన కరువు
- అవసరమైతే తనను మార్చుకోవచ్చని తేల్చిచెప్పిన ఆ అధికారి
- చేసేదేమీ లేక మిన్నకుండిపోయిన వైనం

**పోస్టింగ్‌ల్లో టీడీపీ ప్రజాప్రతినిధులదే ఆధిపత్యం**

**జనసేన ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన సీఐలకు నో ఛాన్స్**

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/విశాఖ సిటీ:

క్షవరం అయితే గానీ వివరం రాదు.. ఈ సామెత జనసేనకు కరెక్ట్‌గా సరిపోతుందన్న విషయం తాజాగా విశాఖలో సీఐ పోస్టింగుల వ్యవహారం చూసిన తర్వాత కలుగుతున్న అభిప్రాయం. ఇప్పటికే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీలో కనీసం ఒక్క సీటు దక్కలేదని మండిపడుతున్న జనసేన నేతలకు తాజాగా సీఐల పోస్టింగుల్లోనూ అదే వివక్ష కొనసాగడంతో కక్కలేక మింగలేకపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో అధికారుల బదిలీల ప్రక్రియ కొనసా..గుతోంది. ఇప్పుడిదే కూటమిలో కుంపటి రాజేసింది. ఈ బదిలీల్లో కేవలం తెలుగుదేశం పార్టీ నేతల పెత్తనమే సాగుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న నలుగురు జనసేన ఎమ్మెల్యేల ప్రతిపాదనలను కనీసం పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఏ చిన్న సమావేశం, కార్యక్రమం జరిగినా రాసుకొని పూసుకొని తిరిగిన నేతలు.. ఇప్పుడు కారాలు మిరియాలు నూరుకుంటున్నారు. అయితే, తాము చెప్పిన వారికి పోస్టింగులు దక్కకపోవడంతో ఏకంగా తమ గన్‌మెన్లను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని నగర పరిధిలోని ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారితో మాట్లాడిన ఎమ్మెల్యేలకు చేదు సమాధానం రావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మరోవైపు తన పోస్టింగులు నచ్చకపోతే తననే మార్చుకోవచ్చంటూ పోలీసు ఉన్నతాధికారి సమాధానమివ్వడం వీరికి మింగుడుపడటం లేదని సమాచారం. దీంతో చేసేదేమీ లేక వెనక్కి పంపిన గన్‌మెన్‌ను తిరిగి తన వద్దే ఇప్పటికే పంచకర్ల చేర్చుకోగా.. సోమవారం గన్‌మెన్లను వెనక్కి పంపాలనుకున్న వంశీకృష్ణ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.


**టీడీపీ ఎమ్మెల్యేలు చెప్పిన వారికే..!**

జిల్లాలో అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ జరుగుతోంది. జాబితాలు సిద్ధమవుతున్నాయి. ఇందులో టీడీపీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సులకే ఉన్నతాధికారులు పెద్ద పీట వేస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. జనసేన ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలు బుట్టదాఖలు చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో పోలీస్ శాఖలో ఇప్పటికే కమిషనర్, ఎస్పీ, డీసీపీ, ఏడీసీపీ, ఏడీఎస్పీల నియామకాలు పూర్తయ్యాయి. ఈ పోస్టింగ్‌ల్లో జనసేన ప్రజాప్రతినిధులను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. ఈ ప్రక్రియ అంతా చినబాబు కనుసన్నల్లోనే జరిగిందన్న టాక్ నడుస్తోంది. కనీసం స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లను అయినా తమకు అనుకూలంగా ఉన్న వారిని, తెలిసిన వారిని నియమించుకోవాలని నలుగురు జనసేన ఎమ్మెల్యేలు భావించారు. వారి నియోజకవర్గంలో ఉన్న స్టేషన్లకు సంబంధించి కొంత మంది ఇన్‌స్పెక్టర్లకు సిఫార్సు లేఖలు సైతం ఇచ్చారు. అయితే ఇందులో ఒక్కరికి కూడా పోస్టింగ్ లభించకపోవడంతో ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.

**'కాపు' కాసిన వారికే వెన్నుపోటు**

చంద్రబాబుకు అధికారం దక్కడం కోసం 'కాపు' కాసిన వారికే వెన్నుపోటు పొడుస్తున్నారన్న చర్చ ఆ సామాజిక వర్గంలో జోరుగా సాగుతోంది. ఉమ్మడి విశాఖలో కాపు సామాజిక వర్గానికి చెందిన ఒకరికి కూడా చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వలేదు. కనీసం అధికారుల బదిలీల్లో అయినా కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇస్తారని భావించారు. కానీ ఆ వర్గానికి చెందిన వారిని పూర్తిగా పక్కనపెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల విషయాన్ని పక్కనపెడితే.. ఉమ్మడి విశాఖ జిల్లాలో చాలా మంది కాపు సామాజిక వర్గానికి చెందిన ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వారిలో కేవలం ఇద్దరికి మాత్రమే మైదాన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది. కనీసం జనసేన ఎమ్మెల్యేల సిఫార్సు చేసిన కాపు సీఐలను కూడా పక్కన పెట్టడం గమనార్హం. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన వారు మదనపడుతున్నారు.

**పంచకర్ల గన్‌మెన్ సరెండర్!**



సీఐల బదిలీల విషయంలో జనసేన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్‌లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. యలమంచిలిలో సుందరపు విజయ్ కుమార్ సిఫార్సు చేసిన నలుగురిలో ఒకరికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో హోం మంత్రి వ్యవహారంపై ఆయన బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నట్టు తెలుస్తోంది. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో. పోస్టింగులన్నీ టీడీపీ నేతల ప్రతిపాదనలకే ప్రాధాన్యత కల్పించడం హాట్ టాపిక్‌గా మారింది. పంచకర్ల, వంశీకృష్ణ, కొణతాల లేఖలను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. జనసేన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో టీడీపీ నేతల పెత్తనమే సాగుతుండడం చర్చనీయాంశమవుతోంది. ఇదిలా ఉంటే.. కనీసం సీఐ పోస్టింగ్‌ల విషయంలో కూడా తమకు ప్రాధాన్యత కల్పించకపోవడంపై పెందుర్తి జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. శుక్ర, శనివారాల్లో జరిగిన సీఐల బదిలీల్లో తాను చెప్పిన ఒక్కరికీ కూడా చోటు కల్పించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. దీంతో తన గన్‌మెన్‌ను సరెండర్ చేస్తూ ఆదివారం ఉదయం నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారితో మాట్లాడగా.. కనీసం స్పందన లేదని ఆయన అవమానంతో రగిలిపోయినట్టు తెలుస్తోంది. అవసరమైతే తననే మార్చుకోవాలంటూ ఆ అధికారి నుంచి సమాధానం రావడంతో చేసేదేమీ లేక తిరిగి గన్‌మెన్‌ను వెనక్కి పిలిపించుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా ఈ సీఐల బదిలీల్లో తీవ్ర అసంతప్తిలో ఉన్నారు. ఆయన సిఫార్సులను కూడా పట్టించుకోకపోవడంతో సోమవారం తన గన్‌మెన్‌ను సరెండర్ చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**'స్థానిక'ంగాను చిన్నచూపే..**

జనసేన భాగస్వామ్యం కారణంగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని జనసైనికులు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో జనసేన నేతలకు మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. స్థానిక సంస్థల్లోను, నామినేటెడ్ పదవుల్లోను కనీసం 30 శాతం పోస్టులు వరిస్తాయని గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా వాస్తవ పరిస్థితులు కనిపిస్తుండడంతో టీడీపీ నేతలపై మండి పడుతున్నారు. ఇటీవలే జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికలు జరిగాయి. జనసేన పార్టీకి ముగ్గురు కార్పొరేటర్లు ఉండగా.. మరో అయిదుగురు వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి చేరడంతో వారి బలం ఎనిమిదికి పెరిగింది. దీంతో ఆ స్టాండింగ్ కమిటీలో ఒకరికైనా సభ్యుడిగా అవకాశం వస్తుందని భావించారు. అయితే జనసేన కార్పొరేటర్ పేరు ప్రతిపాదన కూడా చేయకపోవడంతో ఖంగుతిన్నారు. అయినప్పటికీ టీడీపీ నుంచి పోటీ చేసిన 10 మంది సభ్యులకు ఓటేసి గెలిపించారు. కనీసం స్టాండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాల్లో అయినా ప్రాధాన్యత కల్పిస్తారని భావించినప్పటికీ.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో జీవీఎంసీలోను జనసేన కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

# త్వరితగతిన విద్యుత్తు పునరుద్ధరణ పనులు

**ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి**

సాక్షి, విశాఖపట్నం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు.ప్రభుత్వ ఆస్పత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. అన్ని సెక్షన్ కార్యాలయాలలో జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. ఈ పనుల్ని యుద్ధప్రాతిపదికన సరిచేసినట్లు తెలిపారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నంబరు 1912కు, కంట్రోల్‌రూమ్ నంబర్లకు 2583 ఫిర్యాదులు రాగా వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేశామనీ.. వీటిలో కేవలం ఒక్క రోజులోనే 2,175 ఫిర్యాదులను పరిష్కారించగలిగామన్నారు. డైరెక్టర్ ఆపరేషన్స్ విజయలలిత నేతృత్వంలో సీజీఎం ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తిని విజయనగరం సర్కిల్‌కు, జనరల్ మేనేజర్లు జి.ప్రసాద్, ఎల్.దైవప్రసాద్‌లను శ్రీకాకుళం సర్కిల్‌కు నోడల్ ఆఫీసర్లగా నియమించామని తెలిపారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో ఇప్పటివరకు గుర్తించిన సమాచారం మేరకు 9 మండలాలకు 9, 60 గ్రామాలకు 60,3,299 సర్వీసు కనెక్షన్లకు 3,251, 33కెవి ఫీడర్లు 14 కి 14, 11 కేవీ ఫీడర్లు 100కి 100, 11కెవి స్తంభాలు 67కి 58, ఎల్‌టి స్తంభాలు 78కి 70, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 26కి 20, వ్యవసాయ కనెక్షన్లు 56కి 42 సర్వీసులను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. విద్యుత్ అంతరాయం సమాచారం కోసం టోల్‌ఫ్రీ నం.1912కు, కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 9490612633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 7382299960, ఏలూరు 9440902926 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

# నిండుకుండల్లా రిజర్వాయర్లు

- గరిష్ట స్థాయికి 'తాండవ' నీటి మట్టం
- స్పిల్‌వే గేట్ల ద్వారా నీరు విడుదల
- ప్రమాదస్థాయిలో కల్యాణపులోవ, కోనాం, పెద్దేరు నీటి మట్టాలు
- సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



కల్యాణపు లోవ రిజర్వాయర్ గేట్లు ఎత్తి విడుదల చేస్తున్న నీరు



తాండవ రిజర్వాయర్ వద్ద నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తున్న ఈఈ స్వామినాయుడు డీఈ అనురాధ, జేఈ శ్యామ్‌కుమార్

సాక్షి, అనకాపల్లి/నాతవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో వాగులు, చెరువుల ద్వారా రిజర్వాయర్లలోకి భారీగా నీరు చేరింది. దీంతో జిల్లాలో తాండవ, కల్యాణపులోవ రిజర్వాయర్లలో నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరింది. ఈ రెండు రిజర్వాయర్ల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడిచిపెట్టారు. పెద్దేరు, కోనాం, రైవాడ, కల్యాణపు లోవ రిజర్వాయర్లలో కూడా గరిష్టస్థాయికి చేరువలో నీటిమట్టం ఉంది. తాండవ గరిష్ట నీటి మట్టం 380 అడుగులు కాగా..ప్రస్తుతం 378 అడుగులకు చేరుకుంది. దీంతో శనివారం రాత్రి రెండు గంటల నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకు స్పిల్‌వే గేట్ల ద్వారా 1,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో ఆదివారం 11.40గంటల నుంచి మరో 1,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

- చోడవరం నియోజకవర్గంలో ఉన్న కల్యాణపు రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 460 అడుగులు కాగా.. ప్రస్తుతం 459 అడుగులకు చేరింది. రిజర్వాయర్ నుంచి రెండు గేట్ల ద్వారా 250 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు.
- మాడుగుల మండలంలో పెద్దేరు జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా..ఆదివారం నాటికి 135 మీటర్ల చేరింది.
- రైవాడ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా..ప్రస్తుతం 109 మీటర్లకు చేరింది. దీని సామర్థ్యం 3.6 టీఎంసీలు వరకు ఉంటుంది.
- కోనాం రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 101.25 మీటర్ల కాగా..ప్రస్తుతం 98 మీటర్లకు చేరింది. రిజర్వాయర్లలో నీటిమట్టాలు పెరుగుతుండడంతో సమీప గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

**తాండవలోకి అధికంగా ఇన్‌ఫ్లో**

తాండవ రిజర్వాయర్ నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరడంతో స్పిల్‌వే గేట్లు ద్వారా 2,500 క్యూసెక్కులు విడుదల చేశామని ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి తాండవ ప్రాజెక్టులో నీటిమట్టాన్ని పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఒక్కసారిగా 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నీటిని విడిచిపెట్టామన్నారు. తాండవ ఆయకట్టుకు కాలువల ద్వారా 250 క్యూసెక్కుల చొప్పన నీరు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. నాతవరం, కోటనందూరు, తుని మండలాల పరిధిలో నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని ఆయా మండలాలు అధికారులకు తెలియజేశామన్నారు. ఎవరూ నదిలోకి దిగవద్దని దండోరా వేయించినట్టు చెప్పారు. ప్రాజెక్టు డీఈ అనురాధ, జేఈలు రామకృష్ణ, శ్యామ్‌కుమార్ పాత్రుడు, అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు.

## జోరు తగ్గిన వర్షాలు



నర్సీపట్నంలో నీట మునిగిన వరి పొలాలు 10లో

# గుర్తుకొస్తున్నాయి..



వైఎస్సార్.. ఆ పేరు ఓ ప్రభంజనం. నవ్వులో స్వచ్ఛత.. పిలుపులో ఆత్మీయత.. మాట తప్పని, మడమ తిప్పని గుణంతో ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రపంచీకరణ విధానాల యుగంలో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో మేళవించి చూపిన మహోన్నత నాయకుడు వైఎస్సార్. మహానేతను కోల్పోయి 15 ఏళ్లు గడిచిపోయాయి. కానీ ఆ జ్ఞాపకాలు చెరిగిపోలేదు.. ఆ రూపం చెదిరిపోలేదు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా విశాఖలో మహానేత చేపట్టిన అభివృద్ధి.. సంక్షేమాన్ని గుర్తు చేసుకుందాం.. – సాక్షి, విశాఖపట్నం/పెందుర్తి

- ఉమ్మడి విశాఖ జిల్లాపై చెరగని ముద్ర వేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి
- చరిత్ర గతిని మార్చిన మహనీయుడు
- నేడు దివంగత సీఎం వైఎస్సార్ 15వ వర్ధంతి

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2004–2009 మధ్యలో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదు. పెండింగ్ ప్రాజెక్ట్‌లకు పునరుజ్జీవం పోయడం, విశాఖ కార్పొరేషన్‌ను గ్రేటర్‌గా మార్చడం, లక్షలాది మంది సొంతింటి కలను సాకారం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడం, నగరంలో ఉన్న దాదాపు అన్ని పరిశ్రమలకు చేయూతనిచ్చి కార్మికులకు అండగా నిలవడంలో మహానేత తన ముద్ర చూపారు. సాధారణ కార్పొరేషన్‌గా ఉన్న విశాఖ నగరాన్ని గాజువాక, మరో 32 పంచాయతీలను విలీనం చేసి 72 వార్డులతో 2005లో జీవీఎంసీగా మార్పు చేశారు. దేశంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం అమలైన 63 నగరాల్లో వైజాగ్‌ని చేర్చిన ఘనత వైఎస్సార్‌దే. జేఎన్ఎన్‌యూఆర్ఎం ప్రాజెక్ట్ ద్వారా రూ.1,500 కోట్లతో నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. భాగ్యనగరానికి దీటుగా రూ.456 కోట్లు వెచ్చించి బీఆర్‌టీఎస్ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మధురవాడలోని మూడు కొండల మధ్య 300ఎకరాల విస్తీర్ణంలో సెజ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

**దాహార్తి తీర్చింది ఆయనే..**

ఎండాడ ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.23 కోట్లు.. విశాఖ నగర దాహార్తిని తీర్చేందుకు తాటిపూడి నుంచి నగరానికి రూ.95కోట్లతో పైపులైన్ ఏర్పాటు చేయించారు. ఆశీల్‌మెట్ట నుంచి రైల్వేస్టేషన్ వరకు రూ.87 కోట్లతో నగరంలో తొలి ఫ్లైఓవర్ నిర్మించారు. విశాఖ ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ హోదా తీసుకొచ్చిన ఘనత వైఎస్‌దే. రూ.100 కోట్లు కేటాయించి అధునాతన టెర్మినల్ నిర్మాణం జరిపించారు. 1130 పడకలు, 21 సూపర్ స్పెషాలిటీ బ్లాకులతో రూ.250 కోట్లతో విమ్స్ ఆస్పత్రికి 2007లో శంకుస్థాపన చేశారు.

**ఉచిత విద్యుత్ వెలుగులు**

జిల్లా వ్యాప్తంగా 25 వేల వ్యవసాయ సర్వీసులకు ఇప్పటికీ ఉచిత విద్యుత్ అందుతుంది అంటే అది కేవలం వైఎస్సార్ చలవే. రుణమాఫీ ద్వారా రాష్ట్రంలో 17 జిల్లాల పరిధిలో 77.55 లక్షల మంది రైతులకు రూ.1200 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. మాఫీ వర్తించని జిల్లాలోని 55 వేల మంది రైతులకు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకం అందించి అండగా నిలిచారు. విశాఖ ఏజెన్సీలో కాఫీప్లాంటేషన్ ప్రాజెక్టు తీసుకొచ్చింది కూడా వైఎస్ రాజశేఖర్‌రెడ్డే. ఆయన హయాంలో ఈ ప్లాంటేషన్‌కు రూ.144 కోట్లు కేటాయించారు.

**అక్కచెల్లెమ్మలకు పావలా వడ్డీ**

వైఎస్సార్ అధికారం చేపట్టడానికి ముందు డ్వాక్రా రుణాలకు 14 శాతం వడ్డీ వసూలు చేసేవారు. వారికి అండగా నిలవాలన్న సంకల్పంతో వడ్డీ శాతాన్ని 4 శాతానికి(పావలా) తగ్గించి మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన పాలించిన ఐదేళ్ల కాలంలో సుమారు రూ.1000 కోట్లకు పైగా పావలా వడ్డీ రుణాలను డ్వాక్రా మహిళలు పొందారు.

**మూడున్నర లక్షల మందికి గూడు**

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,56,115 మందికి సొంత ఇంటి కలను సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌ది. ఐదేళ్ల పాలనలో సాచురేషన్ పద్ధతిలో పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలతో పనిలేకుండా కేవలం అర్హతను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని ప్రజలకు ఇళ్లు కట్టించారు. నగరంలో కూడా పునరావాస, పూర్‌సెటిల్‌మెంట్ కాలనీలను నిర్మించారు. ఇలా నగరంలో దాదాపు లక్ష మందికి సొంత గూడు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలివిడత ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పెందుర్తి మండలం పినగాడిలో వైఎస్సార్ శ్రీకారం చుట్టారు.

**గోదావరి నీరు మళ్లింపు**

గోదావరి నీటిని విశాఖతో పాటు ఉత్తరాంధ్ర తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించే సంకల్పంతో పోలవరం ఎడమ కాలువను నిర్మించారు. తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం ప్రాజెక్టుల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఏలేరు నీటిని మళ్లించి స్టీల్‌ప్లాంట్ నీటి సమస్యను తీర్చారు. సబ్బవరం కేంద్రంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణానికి వైఎస్సార్ పునాది రాయి వేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్సార్ చేసిన అభివృద్ధి చాంతాడంత.



పినగాడిలో తొలిదశ ఇందిరమ్మ గృహాలకు శ్రీకారం చుడుతున్న వైఎస్సార్(ఫైల్)

**స్టీల్‌ప్లాంట్ విస్తరణ వైఎస్ చలవే..**

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్ పరమయ్యే స్థితికి చేరుకున్న దశలో వైఎస్సార్ ఆ ప్రక్రియను సమర్థవంతంగా ఆపగలిగారు. పరిశ్రమకు చేయూతనివ్వడంతో పాటు ఆనాడు కేంద్రంతో పోరాటం చేసి ప్లాంట్ విస్తరణకు శ్రీకారం చుట్టారు. తద్వారా విశాఖ ఉక్కు పరిశ్రము ఉత్పత్తిని రెట్టింపు చేసుకుంది.

మూతపడిపోతున్న బీహెచ్ఈఎల్‌ను బీహెచ్‌పీవీలోకి విలీనం చేయించారు. అదే స్థితిలో ఉన్న షిప్‌యార్డును నేవీలో విలీనం చేయించారు. ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్ విస్తరణకు పునాదులు వేశారు. అచ్యుతాపురంలో ఇండస్ట్రియల్ కారిడార్, భీమిలిలో ఐటీ కారిడార్, పరవాడ ఫార్మాస్యూటికల్ కారిడార్, దువ్వాడ ఐటీ సెజ్ ఇలా ఎన్నో పరిశ్రమలు వైఎస్సార్ పాలనలో ఉమ్మడి విశాఖ సిగలో ఒదిగాయి.

**విస్తృతంగా సేవా కార్యక్రమాలు**



అనకాపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని వార్డుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి వైఎస్సార్ అని అన్నారు. మహానేత వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అన్న సమారాధనలు నిర్వహించాలని సూచించారు. అనకాపల్లి పట్టణంలోని రింగ్‌రోడ్డు వద్దగల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ తెలిపారు. ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ బీవీ.సత్యవతి, మాజీ ఏపీఐఐసీ డబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ హాజరుకానున్నట్టు వారు పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### జీసీసీ గొడౌన్ వాచ్‌మన్ అనుమానాస్పద మృతి

నర్సీపట్నం: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వెనుక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా కరెంటు స్తంభానికి వాచ్‌మన్ ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఉమామహేశ్వరరావు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నర్సీపట్నానికి చెందిన ఒ.ఉమాపరమేశ్వరరావు పాడేరు ఐటీడీఏ పరిధి డౌనూరు జీసీసీ గొడౌన్‌లో పదేళ్లుగా వాచ్‌మన్ పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన ఇంటి నుంచి వెళ్లి ఆదివారం ఉదయం విద్యుత్ స్తంభానికి తాడుతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

### పసుపు కొమ్ములతో ప్రత్యేక అలంకరణ



పసుపుకొమ్ముల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: శ్రావణమాసం నాలుగో ఆదివారాన్ని పురస్కరించుకుని స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలోని బాలాలయంలో అమ్మవారిని పసుపుకొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. విశాఖ ఉమ్మడి జిల్లా నుంచి కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం ఉచిత అన్నసమారాధన నిర్వహించారు.

# జోరు తగ్గిన వర్షాలు



కోటవురట్ల వెళ్లే మెయిన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న పెదబొడ్డేపల్లి చెరువు నీరు



పొంగిప్రవహిస్తున్న కొండవాగు



జోగునాథుపాలెం వద్ద కోతకు గురైన రోడ్డు



దేవరాపల్లిలో కూలిన దేవితల్లి ఆలయ ప్రహరీ

తుమ్మపాల: జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. అధికారులు అప్రమత్తమై గ్రామస్థాయిలో పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జోరున వర్షాలు కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో సాయంత్రం తెరిపిచ్చాయి.

**సగటున 81.3 మిల్లీమీటర్లు**

జిల్లాలో ఆదివారం నాటికి 1951.4 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవగా, సగటు వర్షపాతం 81.3 మిల్లీ మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా రాంబిల్లి మండలంలో 147.0 మిల్లీమీటర్లు నమోదుకాగా అత్యల్పంగా మాడుగుల మండలంలో 41.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**పొంగిన వాగులు, గెడ్డలు**

నర్సీపట్నం/చీడికాడ: వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. వరదనీటి ఉధృతికి రోడ్లకు గండ్లు పడ్డాయి. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి పెద్ద చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో పొర్లుకట్టు మీద నుంచి ప్రవహిస్తున్నాయి. పెదబొడ్డేపల్లి చెరువు నీరు కోటవురట్ల వెళ్లే మెయిన్ రోడ్డు మీద నుంచి పారుతోంది. జోగునాథునిపాలెం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

**రాకపోకలకు అంతరాయం**

చీడికాడ మండలంలోని వరాహపురం,పెదగొగాడ మధ్య గల కొండవాగు పొంగి ప్రవహించడంతో రెండురోజులుగా 10 గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.చీడికాడ మండలం నుంచి దేవరాపల్లి మండలం వెళ్లాలన్నా, పెదగోగాడ ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇదే ప్రధాన మార్గం.

**కూలిన ఆలయ ప్రహరీ**

దేవరాపల్లి: విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా స్థానిక ఉమామహేశ్వరీ దేవి(దేవితల్లి) ఆలయ ప్రహరీ గోడ కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ప్రతి ఆదివారం జరిగే వారపు సంతలో వ్యాపారులు ఈ గోడకు ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు. ఆదివారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో దుకాణాలు ఏర్పాటు చేయలేదు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

| వర్షపాతం (మిల్లీమీటర్లలో) | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | మునగపాక | 114.7 | ఎస్.రాయవరం | 81.8 | సబ్బవరం | 66.9 | రోలుగుంట | 51.4 |
| రాంబిల్లి | 147.0 | బుచ్చెయ్యపేట | 106.8 | దేవరాపల్లి | 75.3 | కోటవురట్ల | 65.6 | చోడవరం | 51.4 |
| పరవాడ | 119.8 | నక్కపల్లి | 103.0 | కె.కోటపాడు | 73.6 | నాతవరం | 62.4 | నర్సీపట్నం | 50.6 |
| యలమంచిలి | 117.4 | అనకాపల్లి | 101.0 | కశింకోట | 72.0 | మాకవరపాలెం | 62.2 | చీడికాడ | 48.4 |
| అచ్యుతాపురం | 116.4 | పాయకరావుపేట | 92.4 | గొలుగొండ | 71.6 | రావికమతం | 57.9 | మాడుగుల | 41.8 |

# ముగిసిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



ఎం.తరుణ్‌కు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి క్రీడల్లో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక గవరపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి 11వ వెయిట్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్(స్త్రీ, పురుషుల) పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు కొణతాల బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాలో మొదటిసారిగా రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ జిల్లాల నుంచి పురుషుల విభాగంలో 78 మంది, స్త్రీల విభాగంలో 76 మంది ఈ పోటీల్లో తలపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి తిప్పాని దీన్‌షా బాబు, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుమ్మాల వెంకటరామ, తదితరులు పాల్గొన్నారు.

- బెస్ట్ లైఫర్ వుమెన్ విభాగంలో జి.వర్షిత(శ్రీకాకుళం) ప్రథమ, కె.హర్మశ్రీ(తూర్పు గోదావరి జిల్లా) ద్వితీయ, జి.రాజ్యలక్ష్మి(కడప) తృతీయ బహుమతి సాధించారు.
- సబ్-జూనియర్ మహిళా విభాగంలో జి.వర్షిత(శ్రీకాకుళం) ప్రథమ, ఎం.శ్రీలక్ష్మి(విజయనగరం) ద్వితీయ, ఎం.సత్యవతి(కడప) తృతీయ బహుమతి దక్కించుకున్నారు.
- పురుషుల విభాగంలో బెస్ట్ లెటర్స్‌గా ఎం.తరుణ్(శ్రీకాకుళం) ప్రథమ, జి.రవికుమార్(కడప) ద్వితీయ, సీహెచ్.వినయ్‌కుమార్(తూర్పుగోదావరి) తృతీయ బహుమతి గెలుచుకున్నారు.
- సబ్ జూనియర్ పురుషుల విభాగంలో డి.భాను తేజ(కడప) ప్రథమ, బి.తరుణ్ ఆదిత్య(గుంటూరు) ద్వితీయ, ఎస్.భాస్కరరావు(విజయనగరం) తృతీయ బహుమతి గెలుపొందారు.



## పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా మృత్యువాత

- అనకాపల్లిలో రైలు నుంచి జారిపడి వివాహిత మృతి



నీరజ(ఫైల్)

అనకాపల్లి: కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యక్షేత్రానికి వెళ్లిన ఓ వివాహిత మరో పావుగంటలో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా, ఇంతలో రైల్లోంచి దిగితుండగా కాలుజారి పడి తీవ్ర గాయాల పాలైంది. ఆమె అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారామ్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... మండలంలో మార్టూరు గ్రామానికి చెందిన సాలాపు నీరజ (24) కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉదయం అనకాపల్లి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి దేవాలయానికి పూజల నిమిత్తం వెళ్లి తిరిగి శనివారం రాత్రి దువ్వాడ రైల్వే స్టేషన్లో దిగింది. అక్కడ మరో రైలు ఎక్కి అనకాపల్లిలో రెండో నంబర్ ప్లాట్ ఫామ్‌పై దిగుతున్న సమయంలో రైలు బోగి, ప్లాట్ ఫాం మధ్యలో పడిపోయి తీవ్ర గాయాల పాలైంది. ఆమెను హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో మార్టూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## లారీ, కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

మాకవరపాలెం: వెంకన్నపాలెం గ్రామం వద్ద ఆదివారం లారీ, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా.. ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెం గ్రామానికి చెందిన దుంగల వరహాలరాజు, చీపురుపల్లి దుర్గినాయుడు, శివాజీ, తరుణ్‌కుమార్, నరం మణికంఠ ఆదివారం సాయంత్రం తూర్పు గోదావరి జిల్లా తుని నుంచి కారులో వస్తున్నారు. స్వగ్రామం వచ్చేసరికి తాళ్లపాలెం వైపు నుంచి వస్తున్న ట్రాలీ లారీని క్రాస్ చేస్తుండగా రెండూ ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు అయింది. కారు డ్రైవర్ వరహాలరాజు, సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దుర్గినాయుడు, మణికంఠ తీవ్రంగా గాయపడ్డారు. తరుణ్‌కుమార్, శివాజీలకు స్వల్ప గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మణికంఠ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## జాతీయ స్థాయి వుషూ పోటీలకు 8 మంది క్రీడాకారులు



సర్టిఫికెట్లు ప్రదర్శిస్తున్న క్రీడాకారులతో జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర

అనకాపల్లి: ఉత్తరాఖండ్‌లో వచ్చే నెల జరిగే జాతీయ స్థాయి వుషూ పోటీలకు 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 29, 30 తేదీల్లో రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి 9వ ఇంటర్ జిల్లాల సీనియర్ అండ్ సబ్ జూనియర్ వుషూ పోటీలు నిర్వహించారు. ఇందులో అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామారావు కాలనీలో వుషూ ఫిట్‌నెస్ అండ్ బాక్సింగ్ శిక్షణ కేంద్రానికి చెందిన 8 మంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. క్రీడాకారులు దువ్వాడ అరుణ, ఈగల లక్షిత్, నార్ పిన్ని తులసిరామ్ గోల్డ్ మెడల్స్, బలిజి దుర్గాప్రసాద్, రాపర్తి గోవర్దన్, సాలపు జగదీష్ సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని స్థానిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర ఆదివారం అభినందించారు. విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. క్రీడల ద్వారా శారీరకంగా, దృఢంగా, ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు క్రీడా కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు దువ్వాడ హరీష్, వెంకటేష్, మోహన్ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## కొమరవోలు ఆవలో చేపల మృత్యువాత



కొమరవలోలు ఆవలో మృత చేపలు

రోలుగుంట: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావం మత్స్య సంపదపైనా పడింది. ఈ వర్షాలకు 425 ఎకరాల విస్తీర్ణం కలిగిన కొమరవోలు ఆవలో చేపలు మృత్యువాత పడ్డాయి. భారీ వర్షాలకు ఆవ నీటిమట్టం నిండి ఉంది. దీనికి తోడు కల్యాణపులోవతో పాటు చుట్టుపక్కల చెరువులు, పంట భూముల్లో ఎర్రనీరు చేరుతోంది. ఇటీవల ఖరీఫ్ పంటల సంరక్షణ కోసం రైతులు పిచికారీ చేసిన రసాయనాలు ఆవలోకి చేరడంతో, వీటి చర్యలు తట్టుకోలేక రెండు రోజులుగా చేపలు మృత్యువాత పడి తేలియాడుతున్నాయి. దీంతోపాటు ఒడ్డుకు కొట్టుకొచ్చి రైతుల భూముల్లో దర్శనమిస్తున్నాయి. వాటిని చూసి తమ ఆదాయానికి గండిపడి నష్టపోతున్నామని మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని కొమరవోలు, కంచుగుమల, రోలుగుంటకు చెందిన 80 మత్స్యకార కుటుంబాల వారు కోరుతున్నారు.

# శానిటేషన్ వర్కర్ల బకాయి జీతాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు



యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరణం శివలక్ష్మి, పిల్లా జానకి

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న శానిటేషన్ వర్కర్లకు ఆర్నెల్లుగా జీతాలు రాకపోవడంతో అర్ధాకలితో జీవిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే వాటిని విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో వారు మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాలని నిబంధన ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బడుగు, బలహీన వర్గాల మహిళా కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారని, వారిపై చిన్నచూపు చూడడం దుర్మార్గమన్నారు. హైస్కూల్ స్థాయిలో పనిచేస్తున్న వారికి తీవ్ర పని ఒత్తిడి ఉందన్నారు. విద్యార్థులకు అనుగుణంగా శానిటేషన్ సిబ్బందిని పెంపుదల చేయాలన్నారు. శానిటేషన్ సంబంధించిన అన్ని పరికరాలను ప్రభుత్వం సమకూర్చాలని కోరారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని జీతాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల్లో జీతాలు విడుదల కాకపోతే ఈ నెల 9వ తేదీన కలెక్టర్‌కు సామూహిక వినతిపత్రాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు.

**జిల్లా అధ్యక్షురాలిగా కరణం శివలక్ష్మి ఎన్నిక**

ఏపీ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్ల యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలిగా కరణం శివలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా పిల్లి జానకి, కోశాధికారిగా బి.శకుంతల, ఉపాధ్యక్షురాళ్లుగా మేరపు లక్ష్మి, నిమ్మకాయల నూకరత్నం, పూడి వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా దేవి, నూకరత్నం, గౌరీ పార్వతి, టి. వరలక్ష్మి, సంఘం గౌరవాధ్యక్షురాలిగా ఎం.శ్రీదేవితోపాటు 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# తాచేరు డైవర్షన్ రోడ్డుపై గొయ్యి

నెమ్మదిగా వెళ్తున్న వాహనదారులు



వడ్డాదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు



తాచేరు డైవర్షన్ రోడ్డుపై గొయ్యి పడటంతో నిదానంగా వెళ్తున్న వాహనాలు

బుచ్చెయ్యపేట: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. భీమునిపట్నం, నర్సీపట్నం రహదారిలో విజయరామరాజుపేట తాచేరు నదిపై ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మధ్యలో గొయ్యి పడింది. దీంతో పాడేరు, విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు నెమ్మదిగా వాహనాలను నడిపి రాకపోకలు సాగిస్తున్నారు. గండి పెద్దది పడితే రాకపోకలు నిలిపి వేసేలా బుచ్చెయ్యపేట ఎస్ఐ ఈశ్వరరావు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో శిథిలమైన రోడ్లపై గోతుల్లో వర్షం నీరు చేరింది. వాహనదారులు వాహనాలు నడపడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలైన విజయరామరాజుపేట, మంగళాపురం, లూలూరు, కుముదాంపేట, పీడీ పాలెం, గంటికొర్లాం, శింగవరం తదితర గ్రామాల్లో వరి ఇతర పంట పొలాలు నీట మునిగాయి. రైతులు పాయలు తీసి పొలాల్లో నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తాచేరు, బొడ్డేరు, పెద్దేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆదివారం వడ్డాదిలో పెద్ద సంతకు వ్యాపారులు, కొనుగోలుదారులు రాకపోవడంతో బోసిపోయింది.

# కలెక్టర్ ఆదేశాలతో కదిలిన వైద్య సిబ్బంది

దేవరాపల్లి ఆస్పత్రికి గిరిజన గర్భిణి తరలింపు



రామన్నపాలెం నుంచి బురద రోడ్డులో గర్భిణి నూకాలమ్మను తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి: తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లో గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై అధికారులు స్పందించారు. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ శివారు రామన్నపాలెంకు చెందిన గిరిజన బాలింత తామర్ల లక్ష్మిని కుటుంబీకులు డోలీ మోత ద్వారా తరలించి ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో ప్రసవ సమయానికి చేరువైన గర్భిణులను గుర్తించి సమీప ఆస్పత్రులకు తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎండీఎస్‌కే బాలాజీకి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మండలంలోని వాలాబు పంచాయతీ శివారు రామన్నపాలెంకు చెందిన దుంబరి సన్యాసిరావు భార్య నూకాలమ్మ ఈ నెల 9న ప్రసవించే అవకాశం ఉందని వైద్య సిబ్బంది నిర్ధారించారు. ఆదివారం ఉదయం స్థానిక ఏఎన్ఎం వి.విజయ, ఆశా కార్యకర్త సిహెచ్ దేముడమ్మ బురద రోడ్డులో కాలినడకన అతికష్టం మీద గ్రామానికి చేరుకున్నారు. నూకాలమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడి ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా దేవరాపల్లి ఆస్పత్రికి రావాలని కోరగా సానుకూలంగా స్పందించారు. రామన్నపాలెంకు వాహనం వచ్చే పరిస్థితి లేకపోవడంతో కోడాపల్లి జంక్షన్ వరకు కాలినడకన వైద్య సిబ్బంది తీసుకువచ్చారు. అక్కడి నుంచి వాహనంలో ఆస్పత్రికి చేర్చారు. ఒక రోజు వ్యవధిలో ఒకే గ్రామానికి చెందిన బాలింత, గర్భిణి పడిన కష్టాలను చూసైన పాలకులు, అధికారులు స్పందించి రామన్నపాలెంకు రోడ్డు సదుపాయం కల్పించాలని సీపీఎం నాయకులు డి. వెంకన్న, బి.టి. దొర డిమాండ్ చేశారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలని నిరసన



యలమంచిలి సీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

యలమంచిలి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఆదివారం యలమంచిలి సీహెచ్‌సీ వద్ద శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించి, వారి జీతాలు సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులు తాటిపాకల చిన్నఅప్పారావు, శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్‌వైజర్లను దళారీ వ్యవస్థకు కాంట్రాక్ట్‌కు అప్పగించడం వల్ల ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. జీవోల ప్రకారం వేతనాలు పెంచకుండా వర్కర్లను తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నారన్నారు. ఐదు నెలలుగా దశల వారీగా శాంతియుత ఉద్యమాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ ఈ నెల 15వ తేదీలోగా బకాయి జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో చదివి అనిల్‌కుమార్, సంతోషి, వెంకటలక్ష్మి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆస్తులపై కన్నేసిన ఎంపీ

- సీఎం రమేష్ కుట్రలను తిప్పికొట్టాలన్న సీపీఎం

అనకాపల్లి: చోడవరం మండలం గోవాడ సహకార చక్కెర ఫ్యాక్టరీని ఆధునికీకరించి క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచి మద్దతు ధర పెంచి రైతులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, నేడు ఇథనాల్ తయారీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే కుట్రలను రైతాంగం తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇథనాల్ తయారీపై మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలతో సమావేశమై నిర్ణయం తీసుకుంటామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ప్రకటించడంపై తమ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుందన్నారు. సహకార చక్కెర ఫ్యాక్టరీ రైతులే షేర్ హోల్డర్స్ అని, వారి భాగస్వామ్యం లేకుండా ప్రజా ప్రతినిధులతో నిర్ణయం తీసుకుంటామనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. ఫ్యాక్టరీ మనుగడను దెబ్బతియ్యాలనుకుంటే రైతులను సమీకరించి పోరాటాలతో అడ్డుకుంటామని హెచ్చరించారు. మూతపడిన ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు మాట్లాడకుండా క్రషింగ్ జరుగుతున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ తయారీ అంశాన్ని తీసుకొచ్చి రైతులు, ప్రజలు దృష్టిని మళ్లించాలనే ప్రయత్నాలను సీఎం రమేష్ విరమించుకోవాలన్నారు. రైతుల కష్టసుఖాలు తెలియని ఎంపీకి ఇథనాల్ తయారీపై ప్రభుత్వం ఇచ్చే భారీ సబ్సిడీని ఉపయోగించుకుని తన చేతుల్లోకి పరిశ్రమ ఆస్తులను తీసుకోవాలని చూస్తున్నారన్నారు. రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్న ఎంపీపై త్వరలో ఉద్యమాలు చేస్తామన్నారు. ఎస్ఈజెడ్‌ల పేర్లతో మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో పంట భూములను సేకరించే ప్రయత్నాలను విరమించుకోవాలన్నాని, జిల్లా ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పరవాడ, అచ్యుతాపురం సెజ్‌ల్లోని ఖాళీ స్థలాల్లో పరిశ్రమలు రాబట్టడానికి ప్రయత్నించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కొత్తగా సెజ్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## క్లుప్తంగా

### అనకాపల్లిలో 10.8 మి.మీ వర్షపాతం

అనకాపల్లి: బంగాళాఖాతంలో ఏర్పాడి అల్ప పీడన ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శని వారం రాత్రి పట్టణ పరిధిలో 10.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవ సాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ ఆదివారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. మరో రెండు రోజల పాటు అక్కడక్కడే వర్షం పడే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులు వర్షాన్ని సద్విని యోగం చేసుకుని వరినాట్లు వేసుకోవాలని సూచించారు.

### వర్షాలు తగ్గుముఖం

కశింకోట: మండలంలో తుపాను వర్షాలు తగ్గు ముఖం పట్టాయి. వరుసగా తుపాను ప్రభావం వల్ల మూడు రోజులపాటు వర్షాలు కురిశాయి. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం చిన్న పాటి వర్షం మినహా కురవలేదు. దీంతో ప్రజలు వర్షాల ఇబ్బందుల నుంచి తేరుకున్నారు. అయితే ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల ఇక్కడి శారదానది నీటి మట్టం పెరిగి ప్రవహిస్తోంది. దీనివల్ల స్థానిక గవరపేటలో నదిపై దోనె ప్రయాణాలు నిలిపివేశారు. వీటిపై నిత్యం తమ పొలాలు, పశువుల పాకలకు రాక పోకలు సాగించే రైతులు ఇబ్బంది పడ్డారు. గ్రామ శివారులో వంతెన మీదుగా సుమారు మూడు కిలో మీటర్ల మేర నడిచి చేరుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొన్నారు.

### వైఎస్సార్ వర్ధంతికి హాజరు కావాలి

కశింకోట: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పం చాయతీ ప్రధాన రహదారిలో వైఎస్సార్ విగ్ర హానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమా నులు హాజరు కావాలని కోరారు.

### ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు



పట్టణ సీఐ విజయకుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ పట్టణ కార్యదర్శి గైపూర్ రాజు

అనకాపల్లి: పట్టణ సీఐ జి.వి. విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకటరమణ, కశింకోట సీఐ అల్లు స్వామినాయుడులను వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి గైపూర్ రాజు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. రాజు మాట్లాడు తూ ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసు కోవాలని కోరారు. ఈ నెల 7న పట్టణంలో శార దానది ఒడ్డున వినాయక నిమజ్జనంలో ఎటువం టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన విన్నవించారు. నాయకులు పాల్గొన్నారు.

## అనకాపల్లి సినిమాలు

మారుతీనగర్ సుబ్రమణ్యం : రాజా(మార్నింగ్,మ్యాటీ)
మిస్టర్ బచ్చన్ : రాజా(మ్యాటీ, సెకండ్‌షో)
తంగలాన్ : సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు : సత్యనారాయణ స్క్రీన్-2
సింబా : పర్తిసాయి
శ్రీలక్ష్మీనరసింహ(జ్యోతి)జామి : షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
నేను కీర్తన : శ్రీసత్య
డిమోంటి కాలనీ2 : రామచంద్ర

## రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేం ద్రంలో 27 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటి వ్-25 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబ ర్.9703619706)ను సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 205 మంది గ్యాస్ బుక్ చేసుకు న్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరా లకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.



# అడుగుకో గొయ్యి..

తుపాను వర్షాలతో ఏ రోడ్డు చూసినా భయంకరంగా దర్శనమిస్తోంది. అడుగుకో గొయ్యి ఏర్పడి వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో తరచూ రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో కన్నూరుపాలెం వద్ద ఆరులైన్ల రోడ్డుపైనా ప్రయాణమంటే హడలిపోతున్నారు.

- ప్రమాదకరంగా తాళ్లపాలెం - నర్సీపట్నం రోడ్డు
- రాకపోకలకు వాహనచోదకుల ఇక్కట్లు
- వాహనాలు పాడవుతున్నాయని ఆవేదన



కన్నూరుపాలెం వద్ద నర్సీపట్నం వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా పెద్ద గోతులు



గోతుల్లో నుంచి వెళుతున్న వాహన చోదకులు

కశింకోట: కన్నూరుపాలెం గ్రామం వద్ద రోడ్లు, భవనాల శాఖకు చెందిన నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డు పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారిం ది. దీంతో వాహన చోదకులు, ప్రజలు రాక పోకలు సాగించడానికి భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణాన ఎటువంటి ప్రమాదానికి గురికావాల్సి వస్తుందోనని వాపోతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

మండలంలో తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే 30 కిలోమీటర్ల మేర పొడవున్న రహదారిని ఆరేళ్ల క్రితం రెండు లేన్లతో విస్తరించి నిర్మించారు. విశాఖ నుంచి నర్సీపట్నం మధ్య రాకపోకలకు ప్రధానమైన రహదారి ఇదే. నిత్యం అనేక ఆర్టీసీ బస్సులు, లారీలు, భారీ వాహనాలు రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. దీనిలో కన్నూరుపాలెం గ్రామం వద్ద రహదారి భారీ వాహనాల తాకిడికి దెబ్బతిని పెద్ద గోతులు పడింది. దీంతో వీటి మీదుగా రహదారిపై రాక పోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు, ప్రయాణికులకు గోతులు స్థాయి కాన రావడం లేదు. దీంతో వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ముగ్గురు వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులయ్యారని స్థానికులు తెలిపారు. బైక్‌లు, ఆటోలు దెబ్బతిని మరమ్మతులకు గుర వుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మూడు దఫాలు ఇక్కడ గోతులు పడ్డాయి. వాటిని రోడ్లు, భవనాల శాఖ అధికారులు తాత్కాలికంగా పూడ్చి చేతులు దులుపుకున్నారు. దీనివల్ల తరచుగా గోతులు పడుతుండటంతో ఇబ్బందులు, ప్రమాదాలు తప్పడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో ఒక్కొక్కసారి గోతులను స్థానిక లారీ డ్రైవర్లు, వాహన చోదకులు సొంత ఖర్చుతో తాత్కాలికం గా పూడ్చుకుంటున్న సందర్భాలున్నాయి. అవి భారీ వాహనాల ధాటికి తట్టుకోలేక యధావిధిగా గోతులు పడుతుండటంతో ఇక్కట్లు తప్పడం లేదని, ఎప్పుడు ఎటువంటి ముప్పు వాటిల్లు తుందోనని వాపోతున్నారు. గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవి స్తున్నా ప్రయోజనం లేకపోతోందని విమర్శిస్తు న్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని, పెద్ద ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకముందే ఉన్నతాధికారులు స్పం దించి గోతులను తక్షణమే శాశ్వత ప్రాతిపదికన పూడ్చి ప్రమాదాలను నివారించాలని, ఇబ్బందు లను తొలగించాలని కోరుతున్నారు.

### ప్రమాదకరంగా గోతులు



కన్నూరుపాలెం వద్ద రోడ్లు, భవనాల శాఖ వద్ద ప్రధాన మార్గంలో పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ గోతుల్లో పడి వాహన చోదకులు గాయపడ్డారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని అధికారులు తాత్కాలికంగా పూడ్చడంతో యధావిధిగా గోతులు పడుతున్నాయి. తామే తాత్కాలికంగా ఒక్కొక్కసారి పూడుస్తున్నాం.

– కన్నూరు నాయుడు, లారీ డ్రైవర్, కన్నూరుపాలెం

### గోతులను పూడ్చాలి



కన్నూరుపాలెం వద్ద రోడ్డుపై పడి ప్రమాదకరంగా ఉన్న పెద్ద గోతులను పూడ్చాలి. వాటిని పూడ్చకుండా చాలా కాలంగా అధికారులు నిర్లక్ష్యంగా వదిలి వేశారు. దీనివల్ల తరచుగా వాహన చోదకులు ప్రమాదా లకు గురవుతున్నారు. పెద్ద ప్రమాదాలు జరగక ముందే గోతులను పూడ్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పైల మహేష్, కన్నూరుపాలెం, కశింకోట మండలం

### అమృతఫల సంస్థకు ఉత్తమ అవార్డు



ఉత్తమ రైతు ఉత్పత్తిదారు సంఘం అవార్డు అం దుకుంటున్న కందర్ప మౌక్తిక

సబ్బవరం : అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కం పెనీ లిమిటెడ్‌ను ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సం ఘం అవార్డు వరించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ 49వ వార్షికోత్సవ వేడు కల్లో భాగంగా ఈ అవార్డుకు ఎంపిక చేసి అంద చేశారు. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆం ధ్రప్రదేశ్‌లో ఉన్న పలు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లను పరిశీలించిన ఐసీఏఆర్-ఎన్ఏఏఆర్ఎం ప్రతినిధులు సబ్బవరంలోని అమృతఫల ఉత్పత్తి దారుల కంపెనీని గుర్తించారు. దీంతో హైదరాబా ద్‌లోని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ ఆడిటోరియం లో జరిగిన 49వ వార్షికోత్సవ వేడుకల్లో ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ చేతుల మీదుగా కం పెనీ సీఈవో కందర్ప మౌక్తికకు అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. దీంతో స్థానిక జాగృతి కార్యా లయంలో ఎండీ కందర్ప సుజాతను కంపెనీ చైర్మన్ పొట్నూరి అప్పారావు, పాలకవర్గ సభ్యులు తదిత రులు అభినందించారు.

### కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ప్రత్యేక పూజలు ఆదివారం 28వ రోజుకి చేరాయి. ఉదయం 8.10 గంటలకు అమ్మవారికి శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పరోక్షంగా పూజలు చేయదల చుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎ స్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమచేసి వారి పేరు, గోత్ర నామం, చిరునామాను 8985515989 వాట్సప్ నంబర్‌కు పంపాలి.

## ఈ నెల కోటాలోనూ బియ్యంతో సరి!



ప్రజా పంపిణీ వాహనంపై పంపిణీ చేస్తున్న బియ్యం

కశింకోట: పౌర సరఫరాల శాఖ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఈ నెలా కోటా కింద కార్డుదా రులకు బియ్యం మాత్రమే ఇస్తున్నారు. అధికా రులు మాత్రం బియ్యంతోపాటు పంచదార, ఇతర సరుకులు అందజేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఉచిత బియ్యం మాత్రమే కోటాపై అంది స్తున్నారు. దీంతో రేషన్‌కార్డులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కోటా కార్డుపై బియ్యం మాత్రమే ఇస్తున్నార ని, ఇతర సరుకులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు తాజాగా జారీ చేసిన ప్రకటనలో మాత్రం ఈ నెల కోటాతో బియ్యంతోపాటు ఏఏవై కార్డుదారులకు కిలో పంచదార రూ.13.50కు, మిగిలిన కార్డుదారులకు అర కిలో పంచదార రూ.17కు అందిస్తామని, ఇతర సరుకులు పంపిణీ చేస్తామన్నారు. పంచదారను సరైన నాణ్యత, తూకంతో అందిస్తామంటున్నారు. దీనిలో లోపం వస్తే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు విరుద్ధంగా బియ్యం మాత్రమే ఇస్తుండటంతో రేషన్‌కార్డుదా రులు పెదవి విరుస్తున్నారు. బహిరంగ మార్కె ట్‌లో ధరలు అధికంగా ఉండటం వల్ల కొనుక్కోలే కపోతున్నామని, గతంలో వలె బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు, గోధుమ పిండి వగైరా సరుకులను రాయితీపై అందించాలని కోరు తున్నారు.

## ఏఐటీయూసీ బహిరంగ సభను జయప్రదం చేయండి



ఏఐటీయూసీ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోన లక్ష్మణ




ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు భద్రం, తదితరులు

అనకాపల్లి: విశాఖలో ఈ నెల 3న ఏఐటీయూసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐటీ యూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం కోరారు. మామిడిపాలెంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ సమావేశాలలో జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు, జాతీయ ఉపాధ్య క్షుడు డి .ఆదినారాయణ తదితరులు పాల్గొంటార న్నారు. 3న విశాఖలో సరస్వతి జంక్షన్ నుంచి మహా కార్మిక ప్రదర్శన ప్రారంభమై జీవీఎంసీ గాం ధీ విగ్రహం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించ నున్నారన్నారు. జిల్లాలో కార్మికులు హాజరుకా వాలని కోరారు. సంఘం అధ్యక్షుడు గోపాలం మహాలక్ష్మినాయుడు, సభ్యులు అరిగా అప్పలకొం డ, మిర్తిపాటి కాశీఅప్పారావు, పీలా వెంకట్రావు, సిహెచ్ అప్పలనాయుడు, చెల్లూరు నాగరాజు పాల్గొన్నారు.

**బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ...**

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం సందర్భంగా ఈ నెల మూడో తేదీన విశాఖలో భారీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీ యూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. ఆదివారం మూలపేటలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో బహిరం గ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లా డారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని, కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. మూలపేట గ్రామ సంఘం కార్యదర్శి మారేడుపూడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చిన్ని సత్తిబాబు, సహాయ కార్యదర్శి చిన్ని గణేష్, నాయకులు గుమ్మాల నాగేశ్వరరావు, ఉప్పిలి ఆదినారాయణ, పల్లా నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్లు చూడటం వల్ల కంటి సమస్యలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అలేఖ్య

అనకాపల్లి: సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడడం వల్ల కం టిచూపు మందగించే అవకాశాలు ఉన్నాయని విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యురాలు అలేఖ్య తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి ఎంపీపీ స్కూల్ ఆవరణలో జిల్లా అంధత్వ నివా రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆహారం, నిత్యం తాజా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడంతో కంటిచూపు మందగించదన్నారు. వయస్సును బట్టి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వంద మందికి కంటి పరీక్షలు చేయగా, వీరిలో 25 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశామన్నారు. కార్య క్రమంలో 84వ వార్డు ఇన్‌చార్జి మాధంశెట్టి నీలబాబు, మాజీ ఎంపీపీ శిరసపల్లి సన్యాసిరావు, శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది హెచ్ అశ్వనీకు మార్, లావణ్య, సీతారామ మహిళా మండలి చైర్మన్ చూచుకొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

### విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మారుతి

కశింకోట: స్థానిక బీసీ హాస్టల్‌లో ఆదివారం సాయంత్రం వంద మంది విద్యార్థులకు స్థానిక యువ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రేజేటి మారుతి దుప్పట్లను పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్టు సభ్యుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సంగీతం.. విశ్వవ్యాప్తం



తోలుబొమ్మలాట ప్రదర్శన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎం.ఎస్ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు

మద్దిలపాలెం: పారా... ద సుప్రీమ్ 7వ వార్షికో త్సవం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు కళా భారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రా జు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీతం విశ్వవ్యాప్తమని, సం గీత విద్వాంసురాలు డాక్టర్ పంతుల రమ స్థాపిం చిన ఈ సామాజిక, సాంస్కృతిక చైతన్య గీతిక ఏడే ళ్లుగా ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సంగీతం పై అవగాహన, ఆసక్తిని కల్పిస్తున్నాయన్నారు. గతంలో స్వచ్ఛ స్వర, స్వర 2 రాగ, స్పందన వంటి వినూత్న కార్యక్రమాలతోపాటు సంగీతానికి సం బంధించిన ఎన్నో ముఖ్య అంశాలపై శిక్షణ శిబి రాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

**అలరించిన తోలుబొమ్మలాట**

వేడుకల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర తోలుబొ మ్మలాట బృందం ప్రదర్శించిన రామాయణంలోని మైరావణ చరిత్ర కథ ఘట్టం అందరినీ అలరించిం ది. తోలుబొమ్మలాటలో సంగీతంపై పరస్పర చర్చ రసవత్తరంగా సాగింది. అనంతరం నిర్వహించిన కృతి సమీక్షలో సంగీత విద్యార్థులు, రసజ్ఞులు కర్ణా టక సంగీత రచనల్లోని సంగీతం, సాహిత్యంపై విశ్లేషణాత్మక ప్రదర్శనలు చేశారు. వీరంతా బరం పూర్, ఢిల్లీ, గోరఖ్‌పూర్ ప్రాంతాల నుంచి రావడం విశేషం. సమీక్షలో పాల్గొన్న వారిని పంతుల రమ, పంతుల గోపాలరావులు ప్రశంసించారు. సంగీత విద్వాంసులు, సంగీత సుధానిధి గురువిల్లి అప్పన్న నాదస్వర కచేరీతో వేడుకలు ముగిశాయి. కంచి కామకోటి పీఠ ఆస్థాన విద్వాంసుడు గురువిల్లి దుర్గారావు డోలుపై సహకరించారు. ఎంతో శ్రావ్య మైన, ఆనందభరితమైన నాదస్వర-డోలు కచేరీ రసజ్ఞులను మంత్రముగ్ధులను చేసింది.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు

గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా 3,500 ప్రతిమల పంపిణీ



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని ఎమ్మెల్యే కొణ తాల రామకృష్ణ కోరారు. స్థానిక మెయిన్‌రోడ్డు జీవీ ఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో 3,500 మట్టి ప్రతిమలతోపాటు వ్రతకల్పపుస్తకం, పసుపు, కుంకుమలను ఆదివారం ఆయన ఉచితం గా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా గ్రీన్ క్లబ్ సభ్యులు మట్టి గణప తులను పంపిణీ చేయడమే కాకుండా పర్యావరణ పరిక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిం చడం అభినందనీయమన్నారు. వినాయక పూజ జీవవైవిధ్యానికి ప్రతిబింబమన్నారు. వినాయక పూజతో మొదలు పెట్టి పర్యావణాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్‌శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.కె.వి.నారాయణరావు, క్లబ్ సభ్యులు ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, తిమ్మాపాత్రుని చక్రవర్తి, కొణతాల రాజేష్, బీరా వినోద్‌కుమార్, ఆర్.అనిత తదితరులు పాల్గొ న్నారు.

### చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన

చోడవరం : చిన్నారుల చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన వచ్చింది. మండలం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభాపాటవాలతో అందమైన చిత్రాలు గీసి అందర్నీ అబ్బుర పరిచారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ సమాజం ఆవరణంలో మండల స్థాయి చిత్రలేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన 60మంది ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఆలోచింపజేసే చిత్రాలు, ప్రకృతి అందాలు ఉట్టిపడే చిత్రాలు చిన్నారులు వేశారు. విజేతలకు ఈనెల 17న బహు మతులు అందజేస్తామని నిర్వాహకుడు తెలిపారు.

## ప్రతి ఒక్కరికీ దైవ చింతన అవసరం

మునగపాక: ప్రతి ఒక్కరికీ దైవ చింతన అవస రమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం మునగపాకలో సంతబయలు ఆలయం లోని శ్రీకృష్ణుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, అచ్యుతాపురం ఫాల్‌జీ బ్రిక్ అధినేత ఆడారి కృష్ణ పాల్గొన్నారు.

## కూరగాయల పంటల్లో తెగుళ్లు నివారించాలి



కె. సంతపాలెంలో కూరగాయల పంటను పరిశీలిస్తున్న ప్రభాకరరావు

కె.కోటపాడు: కూరగాయలు పంటలపై తెగుళ్లు ఆశించకుం డా జాగ్రతలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి జి. ప్రభాకర్‌రావు రైతులకు సూచించారు. ఆదివారం మం డలంలో కె.సంతపాలెం, సూదివలస, పాతవలస, గ్రామాల్లో ఆయన ఉద్యానవన పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కూరగాయల పంటల్లో నిల్వ వున్న నీటిని బయటకు పంపిం చాలని, వ్యాధికారక శిలీం ద్రాలు, చీడపీడలు నివారిం చడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కూరగాయలు పంటలపై ఆకు మచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్ల ఉధృ తి ఎక్కువగా ఉంటుందని, దీనికి ముందు జాగ్రత్త చర్యగా ఒక లీటరు నీటికి 2.5 గ్రాములు సాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అనంతరం విలేకరు లతో మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల ఎక్కడా ఉద్యానవన పంటలకు నష్టం జరగలేదన్నారు. కూరగాయ విత్తనాలు, పండ్ల మొక్కలు సబ్సిడీపై అందిం చడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని విని యోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట కె. సంత పాలెం సర్పంచ్ చల్లా మంగ, ఎస్.పి.ఓ సభ్యులు ప్రభాకర్ పాల్గొన్నారు.



మాడుగుల మండలంలో పంటను పరిశీలిస్తున్న ఉద్యాన వన శాఖాధికారి భాను పుష్పలీలావతి

మాడుగుల రూరల్ : ఇటీవలి వర్షాలకు ఉద్యానవన, కూరగాయలు పంటల్లో నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యానవనశాఖాధికారి వి.భాను పుష్పలీలావతి సూచించారు. ఆదివారం అమె మాడుగుల, చోడవరం, మండలాల్లో గల ఉద్యానవన పం టలు, కూరగాయలు పంటలను రైతులతో కలిసి పరిశీలిం చారు.